• నవ్య వీక్లీ. డిసెంబర్ 21, 2005.

# అమ్మాయిపెళ్ళి

"దాని మొహం దానికేం తెల్సుననీ? ఈ రోజుల్లో ఏ అమ్మమ్మనడిగినా చెబుతుంది ఆడపిల్ల ఏం చదవాలో.. ఎటు వెళ్లాలో. మనం దాని అభివృద్ధినీ మంచినీ కోరేవాళ్లమేగాని దానికన్యాయం చేసేవాళ్లం కాదు గదా! ఉన్నవి చాలక ప్రతి ఏడూ ఎన్నో కొన్ని ఇంజనీరింగ్ కాలేజీలు పుట్టుకొస్తూనే వున్నాయి.. ప్రతి ఏడూ ఎన్నో కొన్ని సీట్లు మిగిలిపోతూనే వున్నాయి.. గోదావరి బ్రిడ్జి అంత పొడవున్న రేంకు వచ్చినా ఏ మారుమూలో సీటు వచ్చేస్తుంది– దీనికొచ్చిన రేంకుకి ఎక్కడో ఒక చోట సీటురాకపోదు– అడవి వూళ్లో కాకపోతే చాలు! ఎంచేతంటే కాలేజీల్లో లెక్చరర్లు లేకపోయినా అడవిలో పుల్లూ సింహాలూ వుంటాయి గదా."

అనంతలక్ష్మి మాటలకి విస్తుపోయేడు విశ్వనాథం. సిటీలైఫూ, న్యూస్‌పేపర్లలోని, టీవీల్లోని న్యూసూ ఎన్నెన్ని సంగతుల్ని నేర్పేయో అనుకున్నాడు.

"దానికి ఇంగ్లీషంటే ఎంతిష్టమో నీకు తెల్సుగదా? మంచి తెలుగు మీడియం స్కూలు యింటిపక్కనే వున్నా ఎక్కడోవున్న ఇంగ్లీషు మీడియం స్కూల్లో చేరింది. ఇంగ్లీషులో క్లాసుఫస్టూ, స్కూలు ఫస్టూ తెచ్చుకుంది. ఇంగ్లీషు లిటరేచర్ చదివి అందులో డాక్టరేట్ తెచ్చుకోవాలని దాని కోరిక. మరి మనం దాని యిష్టంకూడా చూడాలికదా," అన్నాడు నెమ్మదిగా.

"నే చెప్పేదదే – దానిష్టానికి దాన్ని వదిలేయడానికి దానికేం తెల్సుననీ? పెళ్లయి ఒకింటికి వెళ్లే వరకూ మనిష్టమే దానిష్టంగా వుండాలి. ఇంజనీరింగో, కంప్యూటర్ చదువో కాకపోతే అమెరికా అబ్బాయి కాదుగదా అమలాపురం అబ్బాయి కూడ యిష్టపడడు దీన్ని కట్టుకోవడానికి. సీటొచ్చింది కదా అని ఏ పనికిమాలిన డిగ్రీనో కాలక్షేపానికి చదివిస్తే అది దాని వంటిమీదికొచ్చిన ఏళ్లనీ, మీరు డబ్బుసంచుల్నీ మోసుకు తిరిగినా ఆనక దానికి పెళ్లికాదు. ఆ విషయం మీ ముద్దుల కూతురుతో చెప్పండి." అంటూ తెగేసి చెప్పింది.

"నిజమే. ఇంజనీరింగో కంప్యూటర్ చదువో ఫార్మసీలో డిగ్రీయో చదివితే గాని

అమెరికా వెళ్లిన తెలుగు కుర్రాడు పెళ్లికి యిష్టపడ్డంలేదు - ఎంచేతంటే అమ్మాయి అక్కడ సంసారంతోపాటు ఉద్యోగమూ చెయ్యాలి.. అలా అని మన యిష్టాల్ని చంపుకుంటామా? పైగా ఇంజనీరింగ్ చదివించాలంటే మాటలా? ముఖ్యంగా నాలాంటివాడికి! నా ఇరవైఏళ్ల సర్వీసులో ప్రావిడెంట్‌ఫండ్‌లో దాచిందంతా తీసినా దాని మొదటి సంవత్సరం చదువుకి సరిపోదు." అన్నాడు.

"మరదే, ఆలోచించడం చేతకాకపోవడమంటే. చదువు కాకపోతే పెళ్లయినా చెయ్యాలా వద్దా? దానికైనా అప్పోసప్పో చేస్తారా చెయ్యరా? అదే యిప్పుడు చేసి దాన్ని యింజనీరింగ్‌లో జేర్పించడమే తెలివైన పని. అదృష్టముండాలే గాని అక్కడనించి అదే అందుకుంటుంది.

మా మాలతిని చూడండి. దానికిద్దరూ ఆడపిల్లలే అయినా యిప్పుడది విమానాల్లో తిరుగుతూ ఝూమ్మంటూ వెలిగిపోతోంది. వాళ్లాయనకీ మీ కంటే జీతం ఎక్కువేంకాదు - అయితే, మాలతి తండ్రికున్నాయి ఆస్తులు. ఆయనగారు కొడుక్కి మూటగట్టి యిస్తాడు గాని దీనికి పైసాకూడ అప్పుగానైనా యివ్వడు. అటువంటి పరిస్థితిలోనూ పెద్దది ఇంజనీరింగ్ చదివింది. మూడో సంవత్సరంలోనే దానికి అమెరికా సంబంధం కుదిరి పెళ్లయింది. కట్న కానుకలు లేవు సరికదా ఆ పిల్ల యిక్కడి చదువు ఖర్చు అంతా అల్లుడే భరించేడు! రెండో పిల్ల ఎమ్మెస్సీ కంప్యూటర్స్ కాబోలు. దానికీ అంతే. ఏడాది చదువు అవగానే కెనడాలో పన్జేస్తున్న కుర్రాడు కాకినాట్లో దీన్ని చూసి అమాంతంగా పెళ్లి చేసేసుకున్నాడు. దాని అందం చూసి అనుకున్నారేమో! చెప్పొచ్చేదేమిటంటే ఆ చదువులు అలాంటివి - అదృష్టాలు కలిసిరావాలి లెండి! అది వేరే సంగతి-

మొదటి పిల్ల డెలివరీకి అమెరికా వెళ్లి ఆర్నెల్లు వుండి వచ్చిందో లేదో మా మాలతి రెండోపిల్లకి సాయంకోసం అల్లుడు ఫోన్ చేస్తే కెనడా వెళ్లిపోయింది ఒక్కతీ. ఆడపిల్లల్ని కన్నందుకు తల్లిదండ్రుల అదృష్టమంటే అలా వుండాలి మరి." అంటూ ఓ ఉపన్యాసం లాంటిది యిచ్చింది అనంతలక్ష్మి. కానున్నది కాకమానదు అన్న తరహాలో మౌనంగా వుండిపోయాడు విశ్వనాథం.

◆ ❖ ◆

అపర్ణకు ఇంజనీరింగ్ సీటు అందనంత ఎత్తులోనే వుండిపోయింది. కారణం కులం కావొచ్చు, ఎంట్రెన్స్‌లో తెచ్చుకున్న రేంకు కావొచ్చు. అడవి లాంటి వూళ్లో ఆ యేడాదే ప్రారంభమైన ఆ కాలేజీలో "సీటుంది కావలిస్తే" చేరమన్నారు. అలా ఎందులో పడితే అందులో చేరిపోడానికి వీల్లేదంది అనంతలక్ష్మి.

'మనూళ్లోనే బోల్డు కాలేజీలున్నాయి. మంచి కాలేజీ చూసుకుని డిగ్రీలో చేర్చేద్దాం." అన్నాడు విశ్వనాథం వూపిరి పీల్చుకుని.

"ఏదో ఓ డిగ్రీ చెయ్యాలంటే యిన్ని తంటాలెందుకు? డొనేషన్ కట్టి అయినా

ఎలక్ట్రానిక్స్‌లోనో, కంప్యూటర్స్‌లోనో జేర్పించాలి. ఏమో! సుడి ఏ చివర్న వుందో ఎవరు చూడొచ్చారు. తర్వాత ఎమ్మెస్సీ కంప్యూటర్స్ చేస్తే అదృష్టముంటే అనుకున్నదే జరుగుతుంది." అంది అమెరికా మీద ఆశ చావని అనంతలక్ష్మి.

అపర్ణ బియస్సీ ఎలక్ట్రానిక్స్ చదువుతున్న మూడేళ్లూ అనంతలక్ష్మి రోజుకోమారైనా యూనివర్సిటీవాళ్లమీద విసుక్కునేది. "డిగ్రీ మూడేళ్లు చెయ్యకపోతే ఏ రెండేళ్లకో కుదించి ఎమ్మెస్సీ మూడేళ్లు చేయరాదా" అని –

సాయంకాలాలు జాజి పూలుకోసుకుందుకి – డాబా ఎక్కినపుడో, ఆరుబయట మంచంవేసుకుని కూర్చున్నప్పుడో ఎప్పుడన్నా ఆకాశంలో విమానం కన్పిస్తే చాలు, "దీని చదువు పూర్తయ్యేదెప్పుడో.. నేను విమానమెక్కేదెప్పుడో" అని తెగ చికాకు పడిపోయేది!

అపర్ణ డిగ్రీ పూర్తయి ఎమ్మెస్సీలో చేరాక అనంతలక్ష్మి మనసు కొంత శాంతించింది– రెండేళ్లు ఎంతలో గడవాలి? ఈ లోగా తల్లిదండ్రులుగా తాము చేయవలసిన పన్లు కూడా కొన్ని వున్నాయి అనుకుంది. అనుకున్నదే తడవుగా విశ్వనాథంతో చెప్పింది – "చూడండీ అమ్మాయి చదువు రెండేళ్లలో అయిపోతుంది. మన కాలంలా కాళ్లు జాపుకుకూర్చుని ఆ తర్వాత పెళ్లి సంబంధాలు నెమ్మదిగా చూద్దామంటే కుదరదు – ఈ లోగా మనం ప్రయత్నాలు మొదలెట్టేయాలి. తెల్సిందా?"

విశ్వనాథం తలూపేడు. "ఎందుకు తెలీదూ? నా బరువు బాధ్యతలు ఒకరు తెలియజేస్తేనే గాని గుర్తుకు రాని స్థితిలో లేను." అన్నాడు.

"రెండునెలలక్రితమే మార్తాండశాస్త్రి కన్పిస్తే చెప్పేను. మంచి సంబంధం చూసి చెప్పమని – మన వీరభద్రం కూతురికీ అతనే సంబంధం చూశాడుగా." అన్నాడు.

"బాగానే వుంది సంబడం. మీ వీరభద్రం కూతురు ఇంటర్ మొదటి సంవత్సరం తప్పింది. దానికీ మన అపర్ణకీ తేడా లేదూ? అయినా ఇంకా యీ కాలంలో కూడ పెళ్లిళ్ల పేరయ్యల్ని నమ్ముకుని కూర్చుంటామా? బోలెడంత సమాచారాన్నిచ్చే మేరెజ్ బ్యూరోలు వున్నాయి. వాటిల్లో రిజిష్టర్ చేయించామంటే మనం కోరుకున్న అర్హతలున్న పెళ్లి కొడుకుల్ని వారానికి ఒకర్ని చూపించగలరు వాళ్లు. ఆ విషయం నేను చూసుకుంటానుగానీ దాని పాస్‌పోర్టు సంగతేనా మీరు చూడండి. అప్పటికప్పుడు హద్దీ హద్దీ అంటే కుదరదు." అంది అనంతలక్ష్మి.

ఆ తర్వాత మంచిరోజుచూసి పెళ్లిబ్యూరో వాళ్లని కలిసింది. తన అభిప్రాయం చెప్పి వివరాలు అడిగింది –

"చదువూ, అందం, వున్నాయంటున్నారు కాబట్టి మీ అమ్మాయికి తగ్గ కుర్రాడు దొరకడం కష్టమేం కాదు– మీరు చూడాలే గాని వారానికో సంబంధం చూపిస్తాను. మీరు నచ్చుకుని సెటిల్‌చేసుకోవడమే." అంది మారేజ్‌బ్యూరో నడుపుతున్న కుమారి కల్యాణతిలకం అప్లికేషన్ ఫారాన్ని అనంతలక్ష్మికి అందిస్తూ. అనంతలక్ష్మి ఒక్కక్షణం ఆనందపారవశ్యంలో

ఓలలాడింది.

"తాళికట్టు శుభవేళ..." పాట మదిలో మెదిలి మంగళవాద్యాలు విన్పించినట్టయింది-

"ఆడపిల్లల వివరాలు, ఫోటోలతోవున్న ఆల్బమ్‌లూ, మగపిల్లల వివరాలు, ఫోటోలువున్న ఆల్బమ్‌లూ వేరే వేరేగా వున్నాయి. మీరు చూడొచ్చు. ఇప్పుడున్న వాటిల్లో మీకేదైనా నచ్చితే మాట్లాడుకునేందుకు ఏర్పాటు చేస్తాను. ఆ ఘడియ రావాలిగానీ సంబంధం కుదిరిపోవడం ఎంతసేపు? అని;

"అన్నదానపువారమ్మాయి... క్రితంనెల రిజిస్టర్ చేయించారు. పదిరోజుల క్రితం సంబంధం కుదిరిపోయింది. వచ్చేనెల హైద్రాబాద్‌లో తాంబూలాలు పుచ్చుకుంటారట. నన్నురమ్మని నిన్ననే ఆహ్వానించి స్వీట్లిచ్చివెళ్లేరు- అబ్బాయి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అమెరికాలో" చెప్పుకుపోతోంది కల్యాణతిలకం.

అనంతలక్ష్మికి విమానం టిక్కెట్టు కొనుక్కుంటున్నట్టే అన్పించింది.

"మీ ఫీజూ మిగతా వివరాలూ కూడ చెబితే.." అంటూ ఆమె వంక చూసింది-

"ఫీజుదేముంది - మీ పిల్లలకు మంచి సంబంధాలు కుదిరి పెళ్లిళ్లయితే అదే మాకు పదివేలు- మానవసేవ, లోక కళ్యాణమే మా కర్తవ్యం. అయితే మా ఫోను ఖర్చులకూ కాగితాలకూ, పోస్టేజికీ మూడు వేలు యివ్వాల్సివుంటుంది. మా ద్వారా సంబంధం కుదిరిన తర్వాత మీ సంతోషం కొద్దీ యిచ్చేది మేం కాదనం." అని ఒక క్షణం ఆగి, "అయితే మీ అమ్మాయి ఫోటోలు రెండు - ఒకటి బస్ట్ ఫోటో, రెండోది ఫుల్... రెండూ కేబినెట్ సైజులో కావాలి. ఎప్పటివో పాతవి కాకుండా యిప్పుడు తీయించండి. వీలైతే మా వీధిలోనే వున్న ఫోటోగ్రావుగారి చేత తీయించండి. మా దగ్గరకొచ్చే అమ్మాయిలందరి ఫోటోలూ ఆయనే తీస్తారు. అన్నదానపువారమ్మాయికీ ఆయనే తీశాడు. చార్జెస్ కొంచెం ఎక్కువయినా అందంగా తీస్తాడు" అంది కళ్యాణతిలకం.

"సరే అక్కడే తీయిద్దాం... ఫారం నింపి వీలుంటే యీ రోజే డబ్బు కట్టేస్తాను." అంది అనంతలక్ష్మి. ఆటోలో యింటికొచ్చిందన్న మాటేగాని యీ వ్యవహారాలన్నీ ఎంత త్వరగా జరిగితే అంత బాగుండుననుకుంది.

సాయంకాలం విశ్వనాథం ఆఫీసునుండి వచ్చేక విషయం చెప్పి ఫారం నింపమని అతనికందించింది. విషయమంతా విని.,

"ఫీజు మూడువేలే! ఏంచేస్తారనీ? అదిచాలక తర్వాత సంతోషంతో కొంత డొనేషన్ కూడానా! శాస్త్రి గారికి ఐదొందలిస్తే నిక్షేపంలాంటి సంబంధం తీసుకొస్తాడు. అయినా యీ ఫారమేంటీ ఉద్యోగానికి దరఖాస్తు పెట్టుకున్నట్లు-" అన్నాడు కాస్త విసుగ్గా.

"మరి అమ్మాయి వివరాలూ, మన కుటుంబం వివరాలు ఇవ్వమంటండీ. మనకి

ఎటువంటి సంబంధం కావాలో కూడ చెప్పాలి గదా..." అంటూ శాంతపరచింది అనంతలక్ష్మి: విశ్వనాథం పక్కనే కూర్చుని అందులో ఏ వివరాలు రాయాలో చెప్పడం మొదలుపెట్టింది.

"అబ్బాయి ఎబ్రాడ్స్‌లో కనీసం ఇంజనీరుగా పని చేస్తూవుండాలి. అమెరికా అయితే ఉత్తమం. యు.కె. అయినా ఫర్వాలేదు. ఎర్రగా కాని, తెల్లగా కాని శరీర ఛాయ వుండి, ఐదడుగుల ఎనిమిది అంగుళాల ఎత్తుండాలి. అరంగుళం అటూ ఇటూ అయినా ఫర్వాలేదు. కాలంతోపాటు మనమూ మారాలి కాబట్టి కట్నం ప్రసక్తి వుండకూడదు. కులాంతరం పనికి రాదు. అబ్బాయికి తల్లిదండ్రులుండాలని గాని, ఒక వేళ యిద్దరూనో.. ఇద్దర్లో ఒకరో వుంటే వారు వీరితో వుండాలనే పట్టింపులేదు..."

"ఈ కోర్కెల చిట్టాచూస్తుంటే అమ్మాయికి అమెరికా సంబంధం కాదుగదా ఇండియాలో కూడ సంబంధం కుదిరేట్టు లేదు." అంటూ నసిగేడు విశ్వనాథం.

"బాగానే వుంది. ఏ విషయమైనా నిక్కచ్చిగా ముందుగానే చెప్పుకుంటే మంచిది. ఆ సంబంధ బాంధవి కూడ విషయాలన్నీ వివరంగానే రాయమంది మరి!" అంది.

"సంబంధ బాంధవా? ఆవిడెవరు?" విస్తుపోయేడు విశ్వనాథం.

"ఆవిడే. ఆ కన్యాకుమారి. పేరు కల్యాణతిలకంలెండి."

"పేరు బాగానే వుంది. కుమారి అంటున్నావ్. ఇంకా పెళ్లికాలేదా."

"మీకా వూసేల? ముందు ఫారంనింపి సంతకం చెయ్యండి." అంటూ అక్కడ్నించి లేచింది."

◆ ❖ ◆

రెండురోజులు పోయాక రెండు ఫోటోలు తెచ్చి విశ్వనాథానికి చూపించింది అనంతలక్ష్మి.

" ఈ అమ్మాయెవరూ? బాగానే వుంది సినిమా స్టార్లా. రెండూ ఒకరివేనా?" అడిగేడు విశ్వనాథం.

"బాగానే వుంది వ్యవహారం. ముందా చత్వారపు జోడు మార్పించుకోండి. ఆ ఫోటోలు రెండూ మనమ్మాయివే."

"మరి ఇదేమిటి యిలా వున్నాయ్?"

"ఎలా వున్నాయ్? ఆ సంబంధ బాంధవి తీయించుకోమన్నచోటే.. ఆ ఫోటోగ్రావు దగ్గరే తీయించేను. అమెరికా సంబంధాలకి ఆయనే ఎక్స్‌పర్టట." అంది అనంతలక్ష్మి.

"ఫోటోగ్రావు అంటున్నావ్.. మరి...ఫోటోలు వచ్చేయిగదే.."

"అది ఆయనగారి పేరు. నేమ్‌బోర్డ్ మీద 'పి.రావ్' అని రాసుంది. ఇది నిక్‌నేమేమో

మరి! అంతకు ముందు ఆయనగారు సిన్మాస్టార్లకేగాని ఇతరులకు ఫోటోలు తీసేవాడు కాదట."

"ఎంచేతో?" విశ్వనాథం ప్రశ్నని అనంతలక్ష్మి వినిపించుకోలేదు.

"ఇప్పుడు కూడ అమెరికా సంబంధాలకి తప్ప ఇతరులకు తియ్యడు. ఈవిడగారు పంపేరంటే చాలు. తీసి వెంటనేకూడ యిచ్చేస్తాడు. ఎంతపుచ్చుకున్నాడని మాత్రం మీరు అడక్కండి. నేను చెప్పలేను. అయితేనేం? ఏ సిన్మాస్టార్లా కావాలంటే ఆ పోజులో అలా తీస్తాడు. శృతా? శ్రేయా?గీతా? ఎవరిలా వుండాలని అడిగేడు. ఇదేదో ఒక పేరు చెప్పింది. ఆరు డ్రస్సులు కట్టించి రెండు గంటలు వెచ్చించి తీసేడు. అచ్చం సిన్మాస్టార్లా వుండేట్టు తీశాడుగా!" అంది అనంతలక్ష్మి మురిసిపోతూ.

"అదే... అదే.. ముందు నేనలా అనుకునే అడిగేను కదా? ఐతే నాకో అనుమానం.."

"అనుమానం ముందు పుట్టి మీరు తర్వాత పుట్టివుంటారు. ఏమిటో చెప్పండి."

"ఒకవేళ ఆ ఫోటోలు చూసి ఇష్టపడ్డ అబ్బాయి ఆ తర్వాత అమ్మాయిని చూసి పోలికలు కుదరక యీ అమ్మాయి కాదంటేనో..."

"ఆ చూపులూ, మాటలూ అన్నీ ఆ సంబంధం కుదిర్చే కల్యాణతిలకం మధ్య వుండి చూసుకుంటుందిటలెండి! మీ శంకలన్నీ వదిలేయండి.." అంటూ ఫోటోల వంకోమారు గర్వంగా చూసి వాటిని బీరువాలో పెట్టేసింది అనంతలక్ష్మి.

◆ ❖ ◆

ఫీజుకట్టి, ఫోటోలిచ్చి రిజిస్ట్రేషన్ చేయించినా వారానికొకటి కాదుగదా కనీసం నెలకొక సంబంధం కూడ చూపించలేదా కల్యాణతిలకం.

"ఏవమ్మా ఏవీ చెప్పావు కాదు" అనడిగితే...

"నా దగ్గర రిజిష్టరయిన పెళ్లికొడుకుల ఫోటోలూ వివరాలూ చూపించాను. మీకేమో అమెరికా సంబంధమే కావాలి మరి. కొత్తవేమైనా రిజిష్టరైతే తప్పకుండా చెబుతాను. మీరు కూడ రానో, ఫోనో చేస్తూండండి!" అనేసింది.

"వలస పక్షులేవో ఏడాదికోమారు కొల్లేటి ప్రాంతానికొచ్చినట్టు ఏదో ఒక నెలలో అమెరికాలో పన్జేసే మన తెలుగు పిల్లలు కూడ ఇండియాకి పెళ్లి సంబంధాలకోసం వస్తారని తెల్సింది- అప్పుడు కుప్పతెప్పలుగా రిజిస్ట్రేషన్లు అవుతాయట గదా. ముందు మాకే చెప్పాలి సుమండీ..." అని గట్టిగానే చెప్పింది అనంతలక్ష్మి.

ఎలాగైతేనేం ఎమ్మెస్సీ ఫస్టియర్ అయ్యేలోగా ఒక సంబంధాన్ని చూపించిందావిడ 'మీ అమ్మాయికి తగిన సంబంధం.' అంటూ. అబ్బాయి అమెరికాలో ఇంజనీరు.

"పెళ్లిచూపుల్లో అమ్మాయిలు పట్టుచీరో, మడిచీరో కట్టుకుని కూర్చుంటే అబ్బాయిలు

చికాకుపడిపోతారు సుమండీ. వాళ్లకి తగ్గట్టూ అమ్మాయిని తయారు చేయండి.." అని కూడ తిలకంగారే చెప్పడంతో అపర్ణ వద్దంటున్నా హెయిర్‌స్టయిల్ కాస్తదగ్గరుండి మార్పించి మోడ్రన్ డ్రస్ వేయించి చూపులకు కూర్చోబెట్టింది. అబ్బాయికి తల్లిలేదు- అక్కగారూ, తండ్రీ ఇండియాలోనే వుంటారు. అబ్బాయి కాస్త నలుపు అయినా సరే, సంబంధం కుదిరిపోతే బాగుండననుకుంది అనంతలక్ష్మి. కానీ అపర్ణను చూసిన ఆ అబ్బాయి కనీసం ఆమెతో నాలుగు మాటలన్నా మాట్లాడకుండానే వెళ్లిపోయి., "నాకు ఇలాంటి వేషాలు వేసే అమ్మాయిలంటే యిష్టం వుండదు. నాక్కావల్సింది అచ్చమైన పదహారణాల తెలుగు పిల్ల. చక్కటి తెలుగు మాట్లాడగలిగి మంచి ఇష్టాలు హాబీలూ వుండి వంట బాగా చేయగలిగితే చాలు..." అంటూ వర్తమానం అందించేడు.

"ఇదెక్కడి చోద్యం? ఏ దేశంలోవుంటే ఆ దేశంలోని వాళ్లా వుండాలనుకోవాలి గానీ పదహారణాలూ, అరవైనాలుగు కాన్లూ అంటే ఎలా?" అని, అ అబ్బాయిమీదా తిలకం గారి మీదా కోపం తెచ్చుకుంది అనంతలక్ష్మి.

"దేశం గొడ్డు పోయిందా ఏవిఁటే? ఇక్కడ చదువు కుని, ఇక్కడే ఉద్యోగం చేస్తున్న అబ్బాయిలు కూడా పెద్దపెద్ద జీతాలే తెచ్చుకుంటున్నారు. పోనీ అటువంటి సంబంధం ఏమన్నావుంటే చూపించమనరాదూ" అన్నాడు విశ్వనాథం ధైర్యం చేసి.

అనంతలక్ష్మి వెంటనే ఏం మాట్లాడలేదు. తర్వాత నెమ్మదిగా అంది -

"అటువంటివీ చూశాను. పెద్దపెద్ద కుటుంబాలూ, తల్లీదండ్రీ పెళ్లికాని చెల్లెళ్లూనూ... ఇది వెళ్లి వాళ్లందరికీ చాకిరీ చెయ్యాలి. నాకది ఇష్టంలేదు."

◆ ❖ ◆

అపర్ణ ఎమ్మెస్సీ రెండో సంవత్సరం చదువుతున్నప్పుడు మరో సంబంధం సూచించింది కల్యాణతిలకం గారు. అబ్బాయి ఎర్రగా బుర్రగా ఎత్తుకు తగ్గ లావుగా బావుంటాడు. అయితే అతగాడికి తల్లీదండ్రీ యిద్దరూ లేరు. ఇండియాలో దగ్గరబంధువులూ లేరట. తను గ్రీన్‌కార్డు పుచ్చుకుని, ఇల్లుకూడ కొనుక్కుని అక్కడే సెటిలైపోయాడట. అతగాడికి అక్కడ వుండిపోడానికే యిష్టపడ్డ అమ్మాయి కావాలట. అమ్మాయికి తల్లిదండ్రులున్నా లేకపోయినా ఫర్వాలేదట. ఒకవేళ ఉంటే పెళ్లయ్యాక వాళ్లు అమ్మాయిని చూడాలనుకుంటే గనక వాళ్ల సొంత ఖర్చులు పెట్టుకుని చూసి వెళ్లాలేగాని అమ్మాయిని చీటికీ మాటికీ పంపడట...!

ఈ విషయాలన్నీ ముందుగానే తెలియడం వల్ల... "అలాంటి ఏకోనారాయణగాడి సంబంధం మాకొద్దులెండి..." అంది అనంతలక్ష్మి.

ఏది ఏమైనా అపర్ణ చదువు పూర్తయ్యేనాటికి మంచి సంబంధమే అదీ అమెరికా

సంబంధమే కుదురుతుందని ఆమెకేదో నమ్మకం.

◆ ❖ ◆

అపర్ణ ఎమ్మెస్సీ పూర్తిచేసింది- యూనివర్సిటీకి థర్డ్ రేంకులో కూడ వచ్చింది. సరదాగా లెక్చరర్ పోస్ట్‌కి ఇంటర్వ్యూకి వెళ్తే అదీ అవలీలగానే వచ్చేసింది.

ఇకచేరడమే తరువాయి.

◆ ❖ ◆

ఆ రాత్రి... పున్నమినాటి ఆ రాత్రి... ఆరుబయట వెన్నెట్లో కూర్చుని అపర్ణ అరచేతులకు గోరింట పెట్టుకుంటూంటే అనంతలక్ష్మి అంది-

"సరైన సంబంధం కుదిరి ఈ ఏడాది ఆ పెళ్లి కూడా అయిపోతే బాగుణ్ణు"అని-

ఈజీచైర్లో కూర్చుని ఆకాశం వంక చూస్తున్న విశ్వనాథం యిటు వంక తిరిగి చూశాడు గానీ మాట్లాడలేదు.

"మీరు వూఁ అనాలే గాని సంబంధం కుదరడం, పెళ్లవడం ఎంతలో జరగాలీ?"అంది అపర్ణ నెమ్మదిగా చిర్నవ్వు చిందిస్తూ.. ఆ శుభ సమయాన్ని దొరకబుచ్చుకుని...

"ఏంవిటే నువ్వనేదీ.." అంటూ ఆశ్చర్యంగా ఆమె వంక చూసింది అనంతలక్ష్మి.

అపర్ణ పెదవి విప్పి అనంతలక్ష్మి గుండెల్లో బాంబునే పేల్చింది.

వరుడు వాసుదేవరావు...యూనివర్సిటీలో ఇంగ్లీషు లెక్చరర్ అనీ... తాము పెద్దల అంగీకారంతోనే పెళ్లి చేసుకోవాలనుకుంటున్నామనీ.. ఈడూజోడూతో పాటు కులం, గోత్రం అన్నీ సరిపోయాయనీ చెబుతూ, "వాళ్లది అమలాపురంట. తాతగారి వూరిప్రక్క వూరే." అంటూ ముగించింది.

'శుభం' అన్నాడు విశ్వనాథం పూర్ణచంద్రుడివైపు ఆనందంగా చూస్తూ.

కూతురి పెళ్లి గురించి తను కన్నకలలన్నీ నీటిబుడగల్లా పేలిపోగా నోటమాటలేక తల పట్టేసుకుని కూర్చుండిపోయింది అనంతలక్ష్మి.

"అన్నట్టు చెప్పడం మరచానేవ్...కల్యాణతిలకమా.. పెళ్లిబొట్టా...ఏమిటో ఆవిడపేరు... ఆ పిల్ల మన మార్తాండశాస్త్రి తోడల్లుడికి చెల్లెలేనట. పెళ్ళికాక, ఉద్యోగమూ రాకపోతే ఖాళీగా వుండడమెందుకని ఆ బ్యూరో పెట్టిందట.." అన్నాడు విశ్వనాథం.

అనంతలక్ష్మి లేచి లోపలికి వెళ్లిపోయింది.

◆ ❖ ◆